

రహదారుల అభివృద్ధికి చర్యలు

- రూ.55.8 కోట్లతో 22 పనులు
- పెండింగ్ హై ఇంపాక్ట్ రోడ్లు చేపడుతాం
- రూ.4.32 కోట్లతో పది కల్వర్టులు
- ప్రజాశక్తితో ఆర్ అండ్ బి ఎస్ఇ మహేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జిల్లాలో రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు రోడ్లు, భవనాల శాఖ ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. రూ.55.8 కోట్లతో 22 ప్లాన్ వర్కులను చేపట్టనున్నట్లు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఐదు హై ఇంపాక్ట్ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. రూ.4.32 కోట్లతో పది కల్వర్టుల పనులు చేయనున్నట్లు తెలిపారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు...

సంవత్సర కాలంలో ఎన్ని పనులు ఎన్ని కోట్లతో ఎన్ని కిలోమీటర్లు పూర్తి చేశారు?

ఎస్ఇ: సంవత్సర కాలంలో 138 పనులను రూ.184 కోట్లతో 888 కిలోమీటర్లు పూర్తి చేసాము.

గతంలో చేసిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు ఇచ్చారా?

ఎస్ఇ: కాంట్రాక్టర్లు గతంలో చేసిన పనులకు 50 శాతం బిల్లులకు పేమెంట్లు అయ్యాయి.

హై ఇంపాక్ట్ రోడ్లు ఎన్ని చేశారు?

ఎస్ఇ : గత సంవత్సరం హై ఇంపాక్ట్ రోడ్డు పనులు ఐదు చేయకుండా వదిలేశారు. ప్రస్తుతం అవి 17.63 కోట్ల నిధులతో చేస్తున్నాం. మూడు పూర్తి అయ్యాయి. రెండు ప్రోగ్రెస్‌లో ఉన్నాయి.

జిల్లాలో ఏ పనులు చేస్తున్నారు?

ఎస్ఇ: ఎస్‌డిఎంఎఫ్ కింద జిల్లాకు పది కల్వర్టులు 4.32 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయి. అందులో ఉల్చాల వద్ద కల్వర్టుకు ఒక కోటి 90 లక్షలతో పని ప్రారంభమైంది. పది పనులు ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. వాటితో పాటు నాబార్డ్ ద్వారా 18.81 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. అవి టెండర్ దశలో ఉన్నాయి. 22 ప్లాన్ వర్కులకు 55.8 కోట్లు మంజూరయ్యాయి. బడ్జెట్ రిలీజ్ అయిన వెంటనే టెండర్లు పిలవాలి.

ఎన్‌డిబిలో ఎన్ని రోడ్లు మంజూరయ్యాయి?

ఎస్ఇ: మూడు రోడ్లు మంజూరు అయ్యాయి గత మూడు సంవత్సరాలుగా మెయింటెనెన్స్ లేక మూడు రోడ్లు బాగా దెబ్బతిన్నాయి.

సంవత్సర బడ్జెట్ ఎంత వచ్చింది?

ఎస్ఇ: సంవత్సరం బడ్జెట్ ఎండిఆర్‌కు రూ.200 కోట్లు, ఎస్‌హెచ్‌కు రూ.200 కోట్లు వచ్చింది. కోడుమూరు - వెల్దుర్తి రోడ్డు మొదలు



పెట్టాలి.

ఇతర పనులు ఏమైనా చేస్తున్నారా?

ఎస్ఇ: బిల్డింగులలోభాగంగా నాలుగు చోట్ల కొత్త టాయిలెట్లు మంజూరయ్యాయి. కర్నూలుకు రూ.20 లక్షలు, ఆలూరు, పత్తికొండ ఎమ్మిగనూరులకు ఒక్కొక్క దానికి రూ.30 లక్షలు మంజూరయ్యాయి. అవి ఆగస్టు నాటికి పూర్తి అవుతాయి. కోసిగి, హోలగుంద, పెద్దకడబూరు రోడ్లకు హైబ్రిడ్ అండ్ డ్యూటీ మోడ్‌లో ప్రతిపాదనలు పంపాము. ముఖ్యమంత్రి రైతు బజార్ ప్రారంభానికి వచ్చిన సందర్భంగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అభ్యర్థన మేరకు నంద్యాల చెక్ పోస్ట్ నుండి సఫా కాలేజ్ వరకు డబుల్ లైన్ నుండి ఫోర్ లైన్ వరకు సెంటర్ లైటింగ్‌తో రోడ్లు వేసేందుకు రూ.65 కోట్లు మంజూరు చేశారు. ఆ పని చేస్తున్నాము.



తుంగాతీరంలో కాలుష్య కారకం..?

- పిటిఎఫ్ఇ ఉత్పత్తి చేస్తే ప్రమాదమే
- వ్యతిరేకిస్తున్న స్థానికులు, పలు సంఘాలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు మండలం గొందిపర్ల గ్రామ పరిధిలోని టిజివి ఎస్ఆర్ఎఎసి (అల్కాలిస్) పరిశ్రమలో రసాయనాల ఉత్పత్తి విస్తరణకు చర్యలు చేపడుతున్నారు. కొత్తగా పిటిఎఫ్ఇ, సిపివిసి, పిఎసి, హైడ్రోజన్ పెరాక్సైడ్ ప్లాంట్లను స్థాపించనున్నారు. వాటికి సంబంధించి పర్యావరణ అనుమతుల కోసం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ కూడా ముగిసింది. ఎపిటిఎఫ్ఇ ఉత్పత్తి చేస్తే ప్రమాదమేనని పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ విస్తరణను స్థానికులు, పలు సంఘాల నాయకులు వ్యతిరేకిస్తున్నారు...

టిజివి ఎస్ఆర్ఎఎసి పరిశ్రమ కర్నూలు మండలం గొందిపర్ల గ్రామ పరిధిలో 152.4 హెక్టార్లలో ఉంది. ప్రస్తుతం ఉన్న పరిశ్రమ సైట్ విస్తీర్ణంలోనే కాస్టిక్, కోరో మీథేన్ తయారీ సామర్థ్యాన్ని విస్తరించడానికి, పాలీ టెట్రా ఫోరో ఎథిలీన్ (పిటిఎఫ్ఇ), క్లోరినేటెడ్ పాలీ వినైల్ క్లోరైడ్ (సిపివిసి), పాలీ అల్యూమినియం క్లోరైడ్ (పిఎసి), హైడ్రోజన్ పెరాక్సైడ్ ప్లాంట్లను స్థాపించాలని ప్రతిపాదించారు. దీనికి సంబంధించి పర్యావరణ అనుమతుల కోసం పరిశ్రమ బయట కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు.

నీటి వనరులపై తీవ్ర ప్రభావం

ఈ పరిశ్రమ విస్తరణ వల్ల కర్నూలు నగరానికి సమీపంలో ప్రవహిస్తున్న కృష్ణ, తుంగభద్ర నదుల నీటి వనరులపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. పరిశోధనలో పిఎఫ్ఎఎస్ రసాయనం ప్రమాదాలు వెల్లడైన తర్వాత కూడా ఈ పరిశ్రమకు అనుమతిస్తే, కృష్ణా నది నీరు తాగడానికి పనికిరాకుండా పోయే ప్రమాదం ఉంది.

- వై.నగేష్, డివైఎఫ్ జిల్లా కార్యదర్శి.



ఈ పరిశ్రమలోని క్లోరోమీథేన్ ప్లాంట్‌లో కార్బన్ టెట్రాక్లోరైడ్ ఉత్పత్తిని, హైడ్రోక్లోరిక్ ఆమ్లం ఉత్పత్తిని పెంచనున్నారు. క్లోర్ - ఆల్కరీ ప్లాంట్‌లో కాస్టిక్ సోడా, లిక్విడ్ క్లోరిన్, క్లోరో మీథేన్స్‌లో మిథైల్ క్లోరైడ్, మిథిలిన్ క్లోరైడ్, క్లోరోఫామ్ ఉత్పత్తిని విస్తరించనున్నారు. కొత్తగా 40 టిపిడి సామర్థ్యంతో పాలీ టెట్రా ఫ్లోరో ఇథిలీన్, 200 టిపిడి సామర్థ్యంతో క్లోరినేటెడ్ పాలి వినైల్ క్లోరైడ్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. పిటిఎఫ్ఇ తయారీలో పిఎఫ్ఓఎ (పెర్‌ఫ్లోరో ఆక్టానిక్ యాసిడ్) వాడతారని, అది చాలా ప్రమాదకరమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పిఎఫ్ఓఎకు ప్రత్యామ్నాయంగా వాడే ఫ్లోరిన్ రసాయనాలు, హెచ్‌పిఎఫ్ఓ డైమర యాసిడ్ కూడా ప్రమాదకరమేనని అంటున్నారు. పిటిఎఫ్ఇకి మండే స్వభావం ఉందని, పేలుడు జరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. పిటిఎఫ్ఇ ఉత్పత్తి నుంచి వెలువడే రసాయనాల వల్ల మూత్రపిండాల, వృషణాల కేన్సర్లు, ఇతర కేన్సర్లు, శ్వాసకోశ ఇబ్బందులు, దీర్ఘకాలిక రోగాలు వస్తాయని అంటున్నారు. బలభద్రపురంలో కేన్సర్ ఉధృతి పెరిగిందని, ఇక్కడ కూడా అలాంటి పరిస్థితే ఉంటుందని చెబుతున్నారు. గుజరాత్‌లో పిటిఎఫ్ఇ విషవాయువులు పీల్చి నలుగురు చనిపోయారని, పిటిఎఫ్ఇ వల్ల ప్రమాదాల గురించి అనేక అధ్యయనాలు చెబుతున్నాయని అంటున్నారు.


తెలంగాణ ప్రజలపైనా ప్రభావం

పరిశ్రమ యాజమాన్యం సమర్పించిన పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో అనేక లోపాలు ఉన్నాయి. ప్రజలకు అవగాహన కల్పించే ముఖ్య సమాచారం అందులో లేదు. సంస్థ తయారుచేసే పాలిటెట్రాఫ్లోరోఇథలిన్ (పీటీఎఫ్ఈ) రసాయన ప్రక్రియలో ప్రమాదకరమైన రసాయనాలు వెలువడతాయి. ఈ రసాయనాల నిల్వ, వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి నివేదికలో ఎటువంటి సమాచారం లేదు. ఇటీవల అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో జరిగిన ప్రమాదంలో 17 మంది కార్మికులు మరణించారు. ఈ పరిశ్రమల తయారీలో ఉపయోగించే సర్ఫెక్టెంట్ల వల్ల క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ పరిశ్రమ తెలంగాణ సరిహద్దులో ఉన్నందున, దీని ప్రభావం అక్కడి ప్రజలపై కూడా ఉంటుంది.

- పిఎస్ రాధాకృష్ణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు.

పిటిఎఫ్ఇ ఉత్పత్తి ప్రమాదకరం

పిటిఎఫ్ఇ ఉత్పత్తి 1950 నుంచి అమెరికాలో ప్రారంభమైంది. పిటిఎఫ్ఇ తయారీ చాలా క్లిష్టమైన ప్రక్రియ. అణువులను జోడించి తయారు చేస్తారు. ఆ ప్రక్రియలో సర్ఫాక్టెంట్స్ ఖచ్చితంగా వాడతారు. టిజివి పరిశ్రమ విస్తరణ పర్యావరణ నివేదికలో వాటి గురించి ప్రస్తావనే లేదు. పిటిఎఫ్ఇ (పాలీటెట్రా ఫ్లోరో ఇథలీన్) ఉత్పత్తికి వాడే రసాయనాల వల్ల హాని లేదని శాస్త్రీయంగా నిరూపించాలి. టిజివి పరిశ్రమలో పిఎఫ్ఓఎ వాడటం లేదని, దానికి ప్రత్యామ్నాయంగా ఇతర రసాయనాలు వాడతామని చెబుతున్నారు. పిఎఫ్ఓఎకు ప్రత్యామ్నాయంగా వాడే ఫ్లోరిన్ రసాయనాలు, హెచ్‌పిఎఫ్ఓ డైమర్ యాసిడ్ కూడా ప్రమాదకరమే. నాన్ ఫ్లోరినేటెడ్ పద్ధతుల్లో పిటిఎఫ్ఇ తయారీకి ఎలాంటి అభ్యంతరం లేదు.



- డాక్టర్ కె.బాబూరావు, ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త.

సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పత్తికొండ



మాట్లాడుతున్న నాయకులు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఐ, సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, సిపిఎం సీనియర్ నాయకులు రంగారెడ్డి కోరారు. ఆదివారం పత్తికొండ పట్టణంలోని చదువుల రామయ్య భవనంలో సిఐటియు మండల కార్యదర్శి గోపాల్, ఎఐటియుసి నెట్టకంటయ్య అధ్యక్షతన సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తులు మాట్లాడారు. 1986లో అమెరికాలోని చికాగో నగరంలో కార్మిక వర్గం 8 గంటల పని విధానం కోసం ప్రాణ త్యాగాలు చేసి పోరాటాల ద్వారా 8 గంటల పని దినాన్ని సాధించుకున్నారన్నారు. పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి, కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మిక హక్కులను హరించేస్తున్నాయని అన్నారు. బడా కార్పొరేట్లకు అనుగుణంగా చట్టాలు తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లేబర్ కోడ్లను నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులను కాలరాస్తే సహించేది లేదని అన్నారు. కార్మికుల 8 గంటల పని దినాన్ని కొనసాగించకపోతే ప్రభుత్వాలకి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు రవిచంద్ర, ప్రజానాట్యమండలి, ఎఐటియుసి తలక కార్యదర్శి ఎం రంగన్న, జిల్లా నాయకుడు కాశి, సిపిఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్ పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లు మాకొద్దు : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజల ఇళ్లలో స్మార్ట్ మీటర్ బాంబును పెట్టొద్దని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.రాముడు, పిఎస్.రాధాకృష్ణ కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిపిఎం 43వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లపై పోరుబాట కార్యక్రమాన్ని ఇందిరాగాంధీ నగర్‌లో ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు స్మార్ట్ మీటర్ పెట్టడం వల్ల ప్రజలపై పడుతున్న బారాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంచుతూ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. టి.రాముడు, పిఎస్.రాధాకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు వై.నగేష్, నగర కమిటీ సభ్యులు ఎం.భాస్కర్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి తెలుగుదేశం నాయకులు చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని ప్రజలకు హామీ ఇచ్చారు. గతంలో ఉన్న జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల పైన కరెంటు చార్జీలభారం, ట్రూకాప్ చార్జీల భారం వేసి బాదుడే బాదుడు చేస్తుందని వీధి వీధినా గ్రామ గ్రామాన ప్రచారం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ మాటను పక్కనపెట్టి రూ.20వేల కోట్ల ట్రూఆప్ చార్జీల భారాన్ని ప్రజలపై వేశారని అన్నారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ప్రజలందరూ ముక్తకంఠంతో మా ఇంట్లో స్మార్ట్ మీటర్ బాంబు పెట్టొద్దని నినదించాలన్నారు. పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలని, అక్రమంగా అదాని కంపెనీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో బళ్లారి చౌరస్తాలో ఉన్న విద్యుత్ సౌద ఎస్ఇ కార్యాలయం ముందు ఈనెల 14న నిర్వహించే ధర్నాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.మద్దిలేటి, ఎ.శ్రీనివాసులు, యు.విజయ్ కుమార్, పి .ఇబ్రహీం, ఎస్.లాల్ మొహమ్మద్. మైదుకూరు హుస్సేన్, పిఎన్ఎం జిల్లా నాయకులు ఎం.లోకేష్, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఎం. నాగరాజు, గోపాల్, వెంకట్, కృష్ణ. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు హాస్పిటల్ : పాత కరెంటు మీటర్లు ఉండగా కొత్త స్మార్ట్ మీటర్లు దండగ, స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించండి అంటూ సిపిఎం ఆధ్వర్యంలో 32 వార్డు ముజఫర్ నగర్, 30వ వార్డు షరీఫ్ నగర్‌లలో ఇంటింటికి కరపత్రం పంపిణీ చేస్తూ వీధిలో ప్రచారం నిర్వహించారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ నరసింహులు, కె సుధాకరప్ప, ముజఫర్ నగర్ కార్యదర్శి ఎంసి. ఆనంద్ మాట్లాడారు. గత ప్రభుత్వం ఆదానితో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం స్మార్ట్ మీటర్లు బిగించడం అన్యాయమని తెలిపారు. సిపిఎం నాయకులు కె సురేష్ , ఇ.రామాంజనేయులు, ఎసి. ఆనంద్ ,సి ప్రసాద్, వెంకటరమణ, మునిస్వామి, సుధాకర్, కృష్ణ, లక్ష్మీనారాయణ, నాగరాజు, మహమ్మద్ గౌస్ , మద్దిలేటి పాల్గొన్నారు.

షరీఫ్‌నగర్‌లో విద్యుత్ సర్దుబాటు పెంపును వ్యతిరేకించండని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. కల్లూరు అర్బన్ 30 వార్డు సెరీన్ నగర్ లో సిపిఎం నగర నాయకులు జి యేసు రాజు వార్డు నాయకులు జి మౌలాలి, ఎస్.జనులదిన్, కెవిపిఎస్ వార్డు నాయకులు కె. పెద్ద మధు భవన నిర్మాణ కార్మిక సంఘం కార్మికులు ఎన్.ప్రభాకర్, గోవిందు, నూర్‌బాషా, మధు ఇంటింటికి స్మార్ట్ మీటర్లు కరపత్రం పంచుతూ ప్రజలను చైతన్యం చేస్తూ స్మార్ట్ మీటర్లు మాకు వద్దు అంటూ ప్రచారం చేశారు.



మాట్లాడుతున్న నాయకులు పిఎస్.రాధాకృష్ణ



32వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాష, వేదికపై జెసి డాక్టర్ దవ్య, సబ్‌కలెక్టర్ , డిఇఒ

10న మెగా పేరెంట్స్, టీచర్ సమావేశం

- కో ఆర్డినేషన్ సమావేశంలో కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 10న జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో , జూనియర్ కళాశాలల్లో నిర్వహించనున్న మెగా పేరెంట్స్, టీచర్ సమావేశం ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో మెగా పేరెంట్స్ టీచర్ సమావేశం 2.0 కి సంబంధించి నియోజకవర్గ, మండల స్పెషల్ అధికారులతో, ఎంపిడిఒ లతో, మండల విద్యాశాఖ అధికారులతో కో ఆర్డినేషన్ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత సంవత్సరం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్ సమావేశం చాలా విజయవంతంగా నిర్వహించామని, ఈసారి ఈనెల 10న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్ సమావేశం ఘనంగా నిర్వహించాలన్నారు. నిర్దేశించిన ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేయాలన్నారు. విద్యార్థులతో స్వయంగా ఆహ్వాన పత్రికలను తయారు చేయించి, కార్యక్రమానికి ఇన్‌చార్జి మంత్రి, మంత్రులు, ఎంపి,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను, ఇతర ప్రజా ప్రతినిధులను, పూర్వ విద్యార్థులను ఆహ్వానించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సంబంధిత పాఠశాల, కళాశాలల్లో ప్రతిభ సాధించిన వారు ఎవరైనా ఉంటే వారు, షైనింగ్ స్టార్ అవార్డులు తీసుకున్న వారు అలాంటి వారందరిని ప్రత్యేకంగా ఆహ్వానించాలన్నారు. పాఠశాలలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు తప్పకుండా సమావేశానికి హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మిడ్ డే మీల్స్‌కు సంబంధించి జోన్4కు ఒక ప్రత్యేకమైన మెనూను కేటాయించామని,మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలన్నారు. అందుకను గుణంగా సరిపడినన్ని బియ్యం, ఇతర సరుకులు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిఎస్ఒను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తల్లి పేరుతో ఒక మొక్క అనే కార్యక్రమాన్ని నిర్వహించాలని, ఈ కార్యక్రమం కింద లీప్ యాప్ లో విద్యార్థులందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వారికి మొక్కలు అందచేసి తల్లి పేరు మీద మొక్కలు నాటించాలని కలెక్టర్ ఆదేశించారు. డిఎఫ్ఒ, డ్వామా పిడిలతో సమన్వయం చేసుకొని మొక్కలను రవాణా చేయించుకోవాలని కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఫోటోలను యాప్‌లో అప్లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని హెడ్ మాస్టర్‌లకు ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ డిఇఒను ఆదేశించారు. విద్యార్థులకు సంబంధించిన హెల్త్ స్క్రీనింగ్ త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిఎంహెచ్‌ఒను ఆదేశించారు. విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులో హెల్త్‌కు సంబంధించిన విషయాలు కూడా రాయాల్సి ఉంటుందన్నారు. మెగా పేరెంట్స్ టీచర్ సమావేశం 2.0కు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్ల పురోగతి పై పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్‌డిఒలను ఆదేశించారు. జిల్లాలో 10 వ తరగతి పరీక్షల్లో సప్లిమెంటరీ పరీక్షల తర్వాత 89 శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, అదనపు ఎస్‌పి హుస్సేన్ పీరా, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా విద్యా శాఖ అధికారి శామ్యూల్ పాల్, డిఎఫ్ఒ శ్యామల, డివిఇఒ సుధీర్, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, అనురాధ, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్‌డిఒ భరత్ తదితరులు పాల్గొన్నారు.

భిన్నత్వంలో ఏకత్వం మనదేశ గొప్పతనం

- జెవివి తెలంగాణ సీనియర్ నాయకులు డాక్టర్ మురళీధర్
- జెవివి జిల్లా మహాసభ విజయవంతం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

భిన్నత్వంలో ఏకత్వం ఉండే గొప్ప దేశం భారతదేశం అని ఈ దేశంలో ప్రతి పౌరుడు భద్రంగా ఉండాలంటే గాంధీ, అంబేద్కర్, మార్క్స్ భావజాలాలు నేటి సమాజానికి ఏ విధంగా ఉపయోగపడతాయో పరిశోధన చేసి ఉపయోగించుకోవాలని తెలంగాణ జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు డాక్టర్ ఎల్ మురళీధర్ అన్నారు. ఆదివారం కర్నూలు హార్ట్ ఫౌండేషన్ సమావేశ మందిరంలో వేదిక 18వ జిల్లా మహాసభలు జెవివి రాష్ట్ర అధ్యక్షులు ధర్మాసురేష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ సైన్స్ పరిశోధనలకు ప్రభుత్వాలు నిధులు కేటాయించి ప్రోత్సహించాలని కోరారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు పరమ సురేష్ కుమార్ మాట్లాడుతూ సైన్స్‌ను ఉపయోగించుకుని మూఢ నమ్మకాల ప్రచారం చేస్తున్నారన్నారు. నిత్య జీవతంలో సైన్స్ ఒక భాగమని తెలిపారు. సైన్స్ నిత్య నూతనంగా నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతుంటే మన జనం మాత్రం మూఢ నమ్మకాల పేరుతో ప్రచారం చేస్తున్నారని అన్నారు.

సమాజం కోసం, సైన్స్‌పై అవగాహన కోసం పనిచేసే వారికి జనవిజ్ఞాన వేదిక తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి అన్నారు. రాయలసీమలో సాగుతాగునీటి సమస్య ఎంతో నిగూఢంగా ఉందని, సామాజిక బాధ్యత ఉన్న ప్రతి పౌరుడు ఈ సీమ నీటి విషయంలో అవగాహన కలిగి ఉండాలని సీమ వాసిగా నీటి ప్రాజెక్టుల విషయంలో అవగాహన లేకపోతే రాబోయే కాలంలో తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రజలు చైతన్యవంతం కావాలని రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షులు బొజ్జ దశరథరామిరెడ్డి అన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ డీన్ అండ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ అఖ్తర్ బాను మాట్లాడుతూ సమాజంలో మహిళలు ముందుండి పోరాటం చేయాలని, సమాజ మార్పుల స్త్రీల పాత్ర కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు. జన విజ్ఞాన వేదిక సమత నాయకురాలు డాక్టర్ అరుణ డైట్ కాలేజీ ప్రిన్సిపల్ ఆదినారాయణ రెడ్డి, మాట్లాడారు. జెవివి జాతీయ నాయకులు మహమ్మద్ మియా, జిల్లా అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి ప్రతాపరెడ్డి, రాష్ట్ర నాయకులు శేషాద్రిరెడ్డి, సుదీర్ రాజు, బాషా, కెసి.రాముడు, సుజాత, ధనుంజయ్, దామోదర్, రామలక్ష్మణ్, శ్రీరాములు, వీరేష్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెవివి తెలంగాణ సీనియర్ నాయకులు డాక్టర్ మురళీధర్

నిరంతరం అందుబాటులో ఉంటాం

-గంగమ్మ చెరువును వెంటనే పునరుద్ధరించాలి
-క్రోనోకార్పస్ విషపూరిత మొక్కలను తొలగించాలి
- చెరువు ఆక్రమణను పరిశీలించిన ఎమ్మెల్యే, కెడిసిసిబి చైర్మన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వారికి అండగా నిలుస్తామని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కెడిసిసిబి చైర్మన్ డి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. కర్నూలు మండలం బి.తాండ్రపాడు గంగమ్మ చెరువు దురాక్రమణపై జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ స్పందించి ఆక్రమణను తొలగించాలంటూ ఇచ్చిన ఉత్తర్వుల నేపథ్యంలో ఆదివారం వారు స్థానిక గ్రామ ప్రజలతో కలిసి గంగమ్మ చెరువు ఆక్రమిత ప్రాంతాన్ని సందర్శించారు. ఈ విజయానికి ప్రధాన భూమిక పోషించిన మాజీ ఎంపిపి రాజవర్ధన్‌రెడ్డిని స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకంతో నివాళులు అర్పించారు. అనంతరం ఈ సందర్భంగా గ్రామంలో విజయోత్సవ సభను స్థానిక సర్పంచి ఆకెపోగు జయన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ... తరతరాలుగా చుట్టుపక్కల 10 గ్రామాలకు జీవాధారంగా ఉన్న గంగమ్మ చెరువును నాటి వైసిపి ప్రభుత్వం అండదండలతో కొంతమంది స్వార్థపరులు దురాక్రమణ చేశారన్నారు. దాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన తమపై, తమ కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టి వేధించారన్నారు. ఇవేవీ లెక్క చేయకుండా తన కుమారుడు ప్రజలకు రాజా వర్ధన్ రెడ్డి అండగా నిలిచారన్నారు. దురాక్రమణకు వ్యతిరేకంగా జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ లో గ్రామ ప్రజలతో కలిసి సవాలు చేశారన్నారు. దురదృష్టవశాత్తు అకాలంగా మతి చెందాడన్నారు. ప్రజలు తన పట్ల చూపిస్తున్న ప్రేమ, ఆదరాభిమానాలు రాజ వర్ధన్ రెడ్డి సేవలకు నిదర్శనం అన్నారు. కుమారుని మృతి తనని మానసికంగా కుంగదీసిందన్నారు. తన ఆశలను ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచి ఉండేలా చేసేందుకు తాను బాధ్యతగా స్వీకరించానన్నారు. అందులో భాగంగానే ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా దురాక్రమణపై పోరాటం సాగించామన్నారు. దీనిపై ఎన్‌జిటి తీర్పు అభినందనీయమన్నారు. ప్రజలు స్పందించక ముందే తక్షణమే అధికారులు ఎన్జిటి తీర్పుపై స్పందించి చెరువు అక్రమ పూడికను తొలగించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్నూలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బుర్ర.వెంకటేష్ నాయుడు మెంబర్ కొంతలపాడు రామాంజనేయులు. తాండ్రపాడు గ్రామ సర్పంచి జయన్న. ఎంపిటిసి మద్దిలేటి, యేసు రాజు, జిల్లా మాజీ అధ్యక్షుడు జై చంద్ర, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విష్ణువర్ధన్ రెడ్డి

10న విద్యారంగ సమస్యలపై మహా ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర వ్యాప్తంగా కేజీ నుండి పీజీ వరకు విద్యారంగ సమస్యల పరిష్కరించాలని ఈనెల 10న విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మహేంద్ర బాబు కోరారు. ఆదివారం రాయలసీమ విశ్వవిద్యాలయం ముందు ధర్నా గోడపత్రికలను విడుదల చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు రమణ, నాయకులు సిద్ధు, హనీఫ్, ప్రమోద్, జనార్ధన్ సూర్య, సన్నీ, దను తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో నిరుద్యోగులు రోడ్డుపాలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను రోడ్డు మీద పాడేస్తుందని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘువేంద్ర విమర్శించారు. ఆదివారం డివైఎఫ్ఐ కర్నూలు ఓల్డ్ సిటీ సమావేశం కర్నూలు సూర్జిత్ భవన్‌లో డివైఎఫ్ఐ మాజీ నాయకులు రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, జిల్లా నాయకులు అబ్దుల్లా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో మూడు లక్షల మంది నిరుద్యోగులను రోడ్డున పాడేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంగా నిరుద్యోగులకు ఉద్యోగమే లక్ష్యంగా 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం. నేడు నిరుద్యోగుల పొట్టగొట్టే పనిని చేపట్టిందని అన్నారు. రేషనలైజేషన్ పేరుతో గ్రామ వార్డు సచివాలయాల్లో 25వేల ఉద్యోగాలు ఊడదీసిందన్నారు. ఏడాది పూర్తి చేసుకుని సంబరాలు చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇస్తామన్న నిరుద్యోగ భతి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల చేస్తున్న నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా యువత పోరాడాలని సూచించారు. ఈనెల 11,12 వ తేదీలలో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్ష కార్యదర్శులుగా అంజి, మధు కమిటీ సభ్యులుగా రాజు, జుబేర్,ఇర్ఫాన్,ఖాదర్,నూరు, చంద్ర, గోపి,ఆలీ అక్బర్ ,శంకర్, ఖాదర్, ఖలీల్ 17 మందితో ఓల్డ్ సిటీ డివైఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న నాయకులు రాఘవేంద్ర

మరుగుదొడ్ల నిర్మాణానికి కృషి

- ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

మహిళల ఆత్మ గౌరవాన్ని కాపాడేందుకు అవసరమున్న చోట మరుగుదొడ్ల నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. ఆదివారం అమరావతి నగర్‌లో కౌన్సిలర్ లలితమ్మ అధ్యక్షతన మున్సిపల్ చైర్ పర్సన్ లోకేశ్వరితో కలిసి ఎమ్మెల్యే పార్థసారథి సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడారు. ఆదోని పట్టణంలో అమరావతి నగర్, ఆరంజ్యోతి, నగర్ నిజాముద్దీన్ కాలనీ, కొత్త బస్టాండ్ రోడ్డు మరో రెండు చోట్ల స్థలాలు గుర్తించి సామూహిక మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ చలపతి రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



బాబు జగ్జీవన్‌రామ్‌కు ఘననివాళి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు డిసిసి కార్యాలయంలో ఆదివారం నాడు మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. జగ్జీవన్ రామ్ నేటి తరం రాజకీయ నాయకులకు స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఐఎన్‌టియుసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి పాషా, కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఎస్‌సి సెల్ జిల్లా చైర్మన్ ఎన్సీ బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు హాస్పిటల్ : పాణ్యం నియోజకవర్గం నంద్యాల చెక్‌పోస్టు దామోదరం సంజీవయ్య భవనంలో నంద్యాల పార్లమెంటు జిల్లా ప్రధాన కార్యదర్శి 16వ వార్డుల ఇన్చార్జి రజాక్ వలి అధ్యక్షతన బాబు జగజ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ నంద్యాల పార్లమెంట్ జిల్లా డిసిసి అధ్యక్షులు , ఏఐసిసి సభ్యులు లక్ష్మి నరసింహ యాదవ్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.అసంఘటిత కార్మికుల నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు పటాన్ అబి ఖాన్, నంద్యాల పార్లమెంట్ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు జీవన్ బాబు, జిల్లా కార్యదర్శి వెంకట నాయుడు, పాణ్యం నియోజకవర్గం మండల అధ్యక్షులు మోషన్, బేగ్, అలీ ఖాన్ షేక్ మాసం నాగార్జున పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు: స్వాతంత్ర సమరయోధులు, భారత ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రావ్ ఆశయాలు ముందుకు తీసుకెళ్లడమే నేటి యువతి యువకుల ముందున్న లక్ష్యమని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం పేర్కొన్నారు. కెవిపిఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్.తిమ్మన్న అధ్యక్షతన సోమప్ప సర్కిల్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్ దేవసహాయం మాట్లాడుతూ డాక్టర్‌బాబు జగ్జీవన్‌రామ్ సమాజంలో అణగారిన వర్గాల కోసం అహర్నిశలు అలుపెరగని పోరాటం చేసిన మహా గొప్ప నాయకులన్నారు. దళితులు పీడితుల అనేక సంక్షేమ పథకాలు పొందుపరచాలని, ఆయన స్ఫూర్తితో అంటరానితనాన్ని కుల నిర్మూలను అంతమొందించాలన్నారు. భవిష్యత్తులో వర్ధంతి, జయంతి సభలు వాడవాడల్లో వీధుల్లోనా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చర్మ కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుమాల ఆంథోనీ, చర్మ కళాకారుల సంఘం టౌన్ అధ్యక్షులు, సుమాల రాజు. కెవిపిఎస్ నాయకులు, గుంటప్ప. బి.సోగునూరు రాముడురంగన్న,భాస్కర్, పుల్లల బాబు , దేవదాసు , మహారాజు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో జగ్జీవన్ రామ్‌కు నివాళి అర్పిస్తున్న దేవసహాయం తదితరులు

జైభీమ్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ వర్ధంతి

మంత్రాలయం : దేశ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని జైభీమ్ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి నేడు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జై భీమ్ ఎంఆర్‌పిఎస్ కర్నూలు జిల్లా కార్యదర్శి మాదిగరత్నం, మంత్రాలయం నియోజకవర్గం ఇన్చార్జి సంఘటి యోహన్ పాల్గొన్నారు.

పల్లె సీమల జీవనాడి జానపదం

ప్రజాశక్తి- కర్నూల్ కల్చరల్

జానపద గీతాలు సంగీతం పల్లె సీమల ప్రజల జీవనాడి అని టిజివి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. వారం వారం సాంస్కృతంలో భాగంగా ఆదివారం రాత్రి తెలంగాణ రాయలసీమ జానపద కళాకారులచే సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమంలో పాల్గొన్న జానపద కళాకారులను సత్కరించారు. సభకు అధ్యక్షత వహించిన పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ప్రతి ఆదివారం టిజి వి కళాక్షేత్రంలో సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. కుటుంబ సమేతంగా నగర ప్రజలు వచ్చి ప్రదర్శనను చూసి ఆనందించాలని కోరారు. ఈ వారం జానపదం ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికీ పల్లెటూర్లో పాట పద్యానికి విపరీతమైన ఆదరణ ఉందన్నారు. జ్యోతి ప్రజ్వలనలో బిసి సంఘం నాయకులు నక్కల మిట్ట శ్రీనివాసులు, మాజీ అధ్యక్షులు పి.దస్తగిరి, రిటైర్డ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యం, వైస్ ప్రెసిడెంట్ సివి రెడ్డి, కర్నూల్ కార్పొరేషన్ మేనేజర్ చిన్న రాముడు, కెవి రమణ, తదితరులు పాల్గొన్నారు. మహమ్మద్ మియా, ఇనాయతుల్లా వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. జానపద కళాకారులు అల్లూరి రాజా, అఖిల విష్ణు హైదరాబాద్ కళాకారులతోపాటు ప్రొద్దుటూరుకు చెందిన నర సింహులు, మహేందర్, వై గంగాధర్ లను టీజీవి కళాక్షేత్రం తరపున సత్కరించి పారితోషికం రూ.35 వేల అందజేశారు. అనంతరం ఆటపాటలతో జానపద వేషధారణలో కళాకారులు అనేక పాటలను పాడి ఆనందం కలిగించారు. ప్రేక్షకులలో అనేకమంది వారితో పాటు నత్యం చేయడం విశేషం.



జానపద కళాకారులను సన్మానిస్తున్న పత్తిఓబులయ్య తదితరులు

సమ్మెను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు

ప్రజాశక్తి - మంత్రాలయం

లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు కోరారు. ఆదివారం సిపిఎం నాయకులు హెచ్ జయరాజు ఆధ్వర్యంలో సమ్మెకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మన దేశంలో ఉన్న పెట్టుబడుదారుల ప్రయోజనాల కోసం బిజెపి నేతృత్వంలో మోడీ కనుసైగల్లో ఉన్న కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ తెచ్చిందని విమర్శించారు. కార్మికుల హక్కులకు ఇబ్బందులు కలిగించే లేబర్ కోడ్లను రద్దు చేయాలని కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, ప్రభుత్వ రంగసంస్థలు ప్రైవేటీకరణ నుంచి ఆపాలని, స్కీంలలో పని చేసే వారిని కార్మికులుగా గుర్తించాలని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే వంటి అంశాలపై డిమాండ్లతో జరిగే దేశవ్యాప్త సమ్మెలో మంత్రాలయం నుండి కార్మికులు ఉద్యోగులు అంగన్వాడీలు ఆశ పంచాయతీ కార్మికులు బిల్డింగ్ కార్మికులు రైతులు వ్యవసాయ కార్మికులు కలసి విజయవంతం చేయాలని కోరారు. సిఐటియు నాయకులు టి ప్రాణేష వ్యవసాయకార్మిక సంఘం నాయకులు డి ఆంధ్రయ రైతు సంఘం నాయకులు టి లక్ష్మన్న తిక్కయ్య తదితరులు పాల్గొన్నారు.



సార్వత్రిక సమ్మె ప్రత్యేక అనుబంధాన్ని ఆవిష్కరిస్తున్న అంజిబాబు, తదితరులు

ఎమ్మిగనూరు : కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాల అని సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు ఎం.సత్తన్న, రైతు సంఘం మండల కార్యదర్శి ఎం.అబ్దుల్లా ఐఎఫ్‌టియు తాలూకా కార్యదర్శి ఎస్.బాలరాజు డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు కార్యాలయంలో కార్మిక సంఘాలు రైతు సంఘాలు సమావేశం నిర్వహించారు. ఐఎఫ్‌టియు తాలూకా కార్యదర్శి కె.అనీఫ్ అధ్యక్షతన నిర్వ హించారు. వారు మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నరేంద్ర మోడీ కార్పొరేట్లకు దాసోహం చేస్తూ పెట్టుబడుదారులకు కార్మిక వర్గాన్ని బానిసలుగా చేసే నాలుగు లేబర్ చట్టాలుగా పార్లమెంట్లో తీర్మానం చేయడం భారతదేశ కార్మిక వర్గాన్ని మోసం చేశారని తెలిపారు. ఈనెల 9న రైతులు కార్మికులు వ్యవసాయ కూలీలు అసంఘటిత రంగ కార్మికులు సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు, ఐఎఫ్‌టియు, రైతు సంఘం నాయకులు షబ్బీర్, రమేష్, నరసయ్య, తిమ్మప్ప, బాబు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు గోవిందు

హక్కుల కోసం సమిష్టి ఉద్యమాలు

ఆదోని : పోరాడి సాధించుకున్న చట్టాలను హక్కులను కాపాడే దిశగా కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు తిప్పన, గోపాల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరన్న తెలిపారు. దేశవ్యాప్తంగా జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయలని ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆదివారం సిఐటియు కార్యాలయంలో పట్టణ సహాయ కార్యదర్శి లక్ష్మణ్ మండల కార్యదర్శి వీరారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి కార్మిక చట్టాలను మార్పు చేస్తూ తీసుకొని వచ్చిన లేబర్ కోడ్స్ వల్ల కార్మికులు కట్టు బానిసలుగా మారే ప్రమాదం ఉందన్నారు లేబర్ కోడ్స అడ్డుకోవడం కార్మికుల పోరాటం వల్లే సాధ్యమవుతుందని తెలియజేశారు. 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయడం ద్వారా కార్మికులకు నష్టదాయకమైన విధానాల్ని అడ్డుకోవడం సాధ్య మవు తుందని తెలిపారు. ఈ సమ్మెలో కార్మి కులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు

ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, శ్రామిక మహిళలకు చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పనకు ఈనెల 9న ఆశ వర్కర్లు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.శివలక్ష్మి కోరారు. ఆదివారం సిఐటియు ఎమ్మిగనూరు కార్యాలయంలో ఆశ వర్కర్ల జనరల్ బాడీ సమావేశం రంగమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.శివలక్ష్మి సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు మాట్లాడుతూ 20 ఏళ్లుగా వైద్యరంగంలో ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశ వర్కర్స్‌కు నేటికీ కనీస వేతనాలు లేక శ్రమ దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రధానమంత్రి ఆయుష్మాన్ భవ 104,108 డెలివరీలు సర్వేలు వివిధ రకాల పనులు చేస్తున్న ఆశ వర్కర్స్‌కు కేంద్ర ప్రభుత్వం గుర్తింపును ఇవ్వడం లేదన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు మహిళలకు అనేక సేవలందించారన్నారు. పలు డిపార్టుమెంట్ వారికి పారితోషికం, డిఎలు ఇంక్రిమెంట్లు పలు రకాల అలవెన్స్ ఇచ్చారని ఆశ వర్కర్స్‌కు మాత్రం వివక్షత చూపడం సరైనది కాదన్నారు. శ్రామిక మహిళా చట్టాలు సాధించుకున్న వాటిని నరేంద్ర మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ చట్టాలను తెచ్చి శ్రామిక మహిళ చట్టాలను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నాలు సరైంది కాదని అందుకు జూలై 9న దేశవ్యాప్త సమ్మెకు ఆశ వర్కర్లు కదలి రావాలని కోరారు. ఈ సమావేశంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు మంజుల, రంగ లక్ష్మి, లింగమ్మ, రామలక్ష్మి, మైమున్, తేజస్విని, మాధవి, అరుణ, లక్ష్మి నరసమ్మ, విశాలాక్షి, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బి.శివలక్ష్మి

44 మంది రైతులకు 5600 మొక్కలు పంపిణీ

- ఎపిఒ శ్రీనివాసులు

ప్రజాశక్తి- నందవరం

మండల ప్రజలకు ఆదివారం మొక్కల పంపిణీ చేసినట్లు ఎపిఒ శ్రీనివాసులు తెలిపారు.44 మంది రైతులకు 5600 మొక్కలు వచ్చినట్లు ఆయన తెలిపారు. హార్టికల్చర్ మొక్కలు కొబ్బరి, జామ, సపోటా, మామిడి, అంజూర, బత్తాయి మొక్కలు వచ్చినట్టు చెప్పారు. వచ్చిన మొక్కలను రైతుల అందరికీ అందించామని తెలిపారు. మొక్కలను నాటి వాటిని పెంచాలని, వాటినుంచి ఆదాయం పొందాలని ఎపిఒ సూచించారు.



జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - ఆదోని

స్వాతంత్ర్య సమరయోధులు, దేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆదోనిలోని తిమ్మారెడ్డి బస్టాండ్ ఆవరణంలో ఆయన విగ్రహానికి పూలమాలతో ఘన నివాళులు అర్పించామని ఎమ్మార్పీఎస్ నాయకులు హనుమంతు, మణి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు దళితులు, వెనుకబడిన తరగతులు, అణచివేతకు గురైన వర్గాల అభ్యున్నతి కోసం జగ్జీవన్ రామ్ అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు.

ఎద్దుల బండి కింద పడి బాలునికి గాయాలు

ప్రజాశక్తి - నందవరం

నందవరం గ్రామానికి చెందిన తెదేపా నాయకులు లచ్చప్ప మనవడు భరత్ కుమార్ (15) పరమాదవశత్తు ఎద్దల బండి కింద పడ్డి గాయపడ్డారు. ఆదివారం ఇంటి దగ్గర నుంచి పొలానికి ఎద్దల బండిలో ఎరువుల మందు సంచులు వేసుకొని వెళ్తుండగా అదుపు తప్పి బండి చక్రాల కింద భరత్ పడిపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు. చికిత్స కొరకు హుటాహుటిన ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మాధవరావు దేశాయ్ ఆసుపత్రిలో భరత్‌ను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

వైసిపిటియుసి జిల్లా సెక్రెటరీగా బోయ కన్న

ప్రజాశక్తి - ఆస్పరి

వైసిపి ట్రెండ్ యూనియన్ జిల్లా సెక్రెటరీగా మండల పరిధిలోని పలకూర బండ గ్రామానికి చెందిన బోయ కన్నాను నియమించారు. ముందుగా ఎమ్మెల్యే విరుపాక్షికి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నన్ను గుర్తించి జిల్లాలో స్థానం కల్పించిన ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కషి చేస్తానన్నారు.





లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆలూరు

పెంచిన పని గంటలు, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి కోరారు. ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో ఆలూరు గ్రామ పంచాయితీ కార్మికులు, ఆటో కార్మికుల చేత సమ్మెకు సంబంధించిన ప్రజాశక్తి సార్వత్రిక సమ్మె ప్రత్యేక సంచికను, పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ కుదించి, పని గంటలను పెంచి కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి.ప్రాణేష, వ్యవసాయకార్మిక సంఘం నాయకులు డి.ఆంధ్రయ్య, రైతు సంఘం నాయకులు టి లక్ష్మన్న తిక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం వేడుకలు

ప్రజాశక్తి-కౌతాళం

త్యాగాలకు ప్రతీకగా, కుల మతాలకు అతీతంగా మొహర్రం వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆదివారం కౌతాళం, కామవరం తదితర గ్రామాలలో పీర్లను ఊరేగించారు. హసన్ హుస్సేన్ ఇమామ్ ఏ ఖాసిం, అక్బర్ వలి తదితర పేర్లను ముందుగానే శ్రీ జగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గా ఆవరణంలోకి చేరుకున్నారు. దర్గా పీఠాధిపతులు శ్రీ సయ్యద్ మున్నా పాషా ఆధ్వర్యంలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. పీర్ల ఊరేగింపు తిలకించడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం కర్బల మైదానంలో దఫన్ కార్యక్రమం నిర్వహించి మొహర్రం ముగింపు కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారి త్యాగాలను స్మరిస్తూ దుఃఖ సాగరంతో స్థానానికి చేరుకున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటన జరగకుండా సిఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే

చిప్పగిరి: త్యాగాలకు ప్రతీక అని, కుల మతాలకతీతంగా మొహర్రంను జరుపుకుంటారని ఎమ్మెల్యే బూసినే విరుపాక్షి, సయ్యద్‌షా వంశీయులు డాక్టర్ సయ్యద్ అరిహుద్దీన్ ఖాదరి, సయ్యద్ రజాక్ ఖాదిరి, సయ్యద్ హర్షద్ ఖాదిరి తెలిపారు. చిప్పగిరిలో ఆదివారం జరిగిన మొహర్రం పీర్ల ఊరేగింపులో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మొహర్రంను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ప్రజలను కోరారు. చిప్పగిరి, దౌల్తాపురం గ్రామానికి చెందిన పీర్లను చూడడానికి వేలాది మంది భక్తులు రావడంతో దర్గా ప్రాంగణం కిక్కిరిసింది. నేమకల్లు గ్రామంలో పీర్ల స్వాములకు మహిళలు పెద్ద ఎత్తున చదివింపులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు కానుకలు సమర్పించారు. సాయంత్రం పీర్లను జల సమాధి చేశారు. చిప్పగిరితో పాటు పలు గ్రామాలలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఎపి శ్రీనివాసులు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



కౌతాళంలో పీర్ల ఊరేగింపునకు భారీగా తరలిన జనం

మంత్రాలయం : మండల కేంద్రంలో పీర్ల దేవుళ్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మొహర్రం పండుగ సందర్భంగా కులమతాలకు అతీతంగా నిర్వహించే మొహర్రం పండుగను ప్రశాంతంగా జరుపుకున్నారు. పీర్ల చావిడిలో కొలువైన హసన్ హుశేన్, ఇమాం ఖాశీం పీర్లను భక్తుల హర్షధ్వనుల మధ్య భాజభజంత్రీల మధ్య డోలు డప్పుల మధ్య గ్రామ పంచాయతీ కార్యాలయం మీదుగా తుంగభద్ర నది వరకు ఊరేగించారు. తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో మొహరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, మంచాల సొసైటీ సహకార సంఘం డైరెక్టర్ డిసి తిమ్మప్ప, ఎంపిటిసి మేకల వెంకటేష్, టిడిపి మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి, బిసి సెల్ జనరల్ సెక్రటరీ వట్టెప్ప నరసింహ చిన్న సుంకప్ప పాల్గొన్నారు.



మొహర్రం వేడుకల్లో ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

ఆస్పరి: మొహర్రం వేడుకలు భక్తి శ్రద్ధల మధ్య ఆదివారం ముగిశాయి. మండల కేంద్రమైన ఆస్పరి, శంకరబండ గ్రామాలలో పిర్లచావడిలో కొలువు దీరిన పీర్ల దేవులకు ప్రత్యేక ప్రార్థనలు చేసి సాయంత్రం మేళతాళాల తో పురవిధుల గుండ తీసుకు వెళ్లారు. అడుగడుగునా భక్తులు బిందెలతో నీలు పోసి, మొక్కులు తీర్చుకున్నారు. ఏటికి తరిలించిన పీర్ల ముందు యువత ఆడిన సావుసోన్ భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉదయం కళాకార్లు వేసిన వివిధ వేషధారణలు తిలకించారు. మొహర్రం వేడుకలలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సిఐ మస్తాన్ వలి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా సిపిఐ నియోజకవర్గ మహాసభ

ప్రజాశక్తి- కోడుమూరు రూరల్

కోడుమూరులో సిపిఐ నియోజకవర్గ మహాసభ ,ఆ పార్టీ నాయకులు బి.కృష్ణ ,బి.రాజు ,ఎం.చిన్న రాముడు, డి.శేషు కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహాసభ ప్రాంగణంలో ఎర్ర తోరణాలతో ముస్తాబు చేసి ఎర్రజెండాను ఎగురవేశారు. ఇరిగేషన్ కార్యాలయం నుండి భారీ ప్రదర్శన చేశారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని, గుండ్రేవుల రిజర్వాయర్ పూర్తికి పోరాటం చేస్తామని, భారీ ఎత్తున నినాదాలు చేశారు.అనంతరం మహాసభ ప్రాంగణం తుల్జా భవాని దేవాలయం ముందు అక్కడ ఏర్పాటు చేసిన జెండాను, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.మాధవస్వామి ఎగురవేశారు. మండల కార్యదర్శి బి.రాజు అధ్యక్షత నిర్వహించిన మహాసభలో సిపిఐ జిల్లా కార్యదర్శి బిగిడ్డయ్య , ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో విచ్చిన్నకరమైన పరిస్థితులు ఏర్పడ్డాయని, ప్రజలకు, కార్మికులకు రైతులకు,వ్యవసాయ కూలీలకు భద్రత లేదని తెలిపారు. దేశంలో ఎక్కడ చూసినా అల్లర్లు పెరిగిపోయాయని వారన్నారు. ఉపాధి లేక వలసలు నివారించడంలో, రైతులను , కార్మికుల ఆదుకోవడంలో, పెరుగుతున్న ధరలను అదుపు చేయడంలో పాలకులు విఫలమయ్యారన్నారు. యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వలేదన్నారు. అధికారంలోకి వచ్చిన తక్షణమే కర్నూలు జిల్లాలో గుండ్రేవుల, వేదవతి, ఆర్ఎస్ తదితర ప్రాజెక్టుల పనులు త్వరగా పూర్తిచేస్తామని చేయలేదన్నారు. ఆయా గ్రామాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ప్రతి హామీని అమలు చేస్తాం

సీనియర్ నాయకులు ఉలిగయ్య

ప్రజాశక్తి- కౌతాళం

ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారని టిడిపి సీనియర్ నాయకులు ఉలిగయ్య పేర్కొన్నారు. ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం లింగాల దీన్నే, అగసల దీన్ని గ్రామంలో నిర్వహించారు. ఉలిగయ్య మాట్లాడుతూ ఏడాది కాలంలోనే 70శాతం హామీలు అమలు చేశారని తెలిపారు. ఇంటింట వెళ్ళి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి హామీని దశల వారీగా పూర్తి స్థాయిలో ఏడాది కాలంలోనే అమలు చేస్తున్నామని, ఇంకా 4 ఏళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ గా తీర్చడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు. అగసలదిన్నె గ్రామంలో రైతులు మహిళా కూలీలు పొలాలకు వెళ్లాలంటే వంకను దాటడానికి పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నాయకులు నాగరాజు గౌడ్, యల్లప్ప, గోవిందప్ప, మారెప్ప,చెన్నబసవ, మునీశ్వమీ, రమేష్, వెంకటేష్,హనుమంతు, సుధాకర్, నాగరాజు,నరసప్ప పాల్గొన్నారు.





రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల సందడి

ప్రజాశక్తి-మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీ మఠంలో కోలాహలం నెలకొంది. ఆదివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశంలో ఉన్న వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ శ్రీ మఠం ప్రాకారంలో ఘనంగా పల్లకోత్సవం నిర్వహించారు. రథోత్సవం సేవలు చేయించిన భక్తులచే సంకల్పం చేయించిన అనంతరం ఉత్సవ మూర్తి అయిన ప్రహ్లాద రాయులను కొయ్య వెండి, వెండి గజానోత్సవం, స్వర్ణ, నవరత్న స్వర్ణ రథం పై ఉంచి మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ భక్త జన సందోహం మధ్య ఘనంగా శ్రీ మఠం ప్రాకారంలో ఊరేగించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బారీ కేడ్లు ఏర్పాటు చేశారు.